సాక్షి
సంగారెడ్డి
మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్న ముస్లింలు

న్యూస్‌రీల్

ముస్లింలకు రంజాన్ పవిత్రమైన పండుగ

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే పండుగ రంజాన్ అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రంజాన్ పర్వదినం పురస్కరించుకుని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు ముస్లిం సోదరుల గృహాలకు వెళ్లి వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు.

ముస్లింల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే సునీతారెడ్డి



హత్నూర మండలం దౌల్తాబాద్ ఈద్గా వద్ద రంజాన్ వేడుకల్లో పాల్గొన్న సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే సునీతారెడ్డి స్పష్టం చేశారు. హత్నూర మండలం దౌల్తాబాద్ ఈద్గాలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ముస్లింలను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మైనార్టీ అభివృద్ధి కోసం తాను ఎప్పుడు సహకరిస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజురెడ్డి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ దౌల్తాబాద్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. హత్నూర మండలంలో రంజాన్ వేడుకలు ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన హత్నూర, దౌల్తాబాద్, కాసాల, చింతలచెరువు,బోరపట్ల, సిరిపురం తోపాటు పలు గ్రామాలలోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం హిందూ ముస్లింలు తేడా లేకుండా స్నేహపూర్వకంగా రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

బసవేశ్వరుడు చూపిన మార్గంలో నడవాలి



ఎంపీ షెట్కార్‌ను సత్కరిస్తున్న బాల్కి పీఠాధిపతి

నారాయణఖేడ్: బసవేశ్వరుడు చూపిన మార్గంలోని నడుచుకోవాలని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ సూచించారు. నాగల్‌గిద్ద మండలం మావినెల్లి గ్రామంలో జరుగుతున్న చెన్న బసవేశ్వర జాతర ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ...మానవాళికి బసవేశ్వరుడు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో బాల్కి పీఠాధిపతి బసవలింగ పట్టదేవర, జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్ షట్కార్, టీపీసీసీ సభ్యుడు శంకరయ్య స్వామి, యూత్ కాంగ్రెస్ నాయకులు సాగర్ షెట్కార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాతర ఉత్సవాల్లో భాగంగా కుస్తీ పోటీలను నిర్వహించి గెలుపొందిన మల్లయోధులకు నగదు బహుమతులు అందజేశారు.

'యువ వికాసం'ను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: జిల్లాలో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ ఇతర వెనుకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. సోమవారం ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ...జిల్లాలో అత్యధిక సంఖ్యలో నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. రూ. 50 వేల లోపు రుణం తీసుకున్న వారికి 100% రాయితీ, రూ.లక్ష లోపు రుణం తీసుకున్న వారికి 90%రాయితీ, రెండు లక్షల వరకు రుణం తీసుకున్న వారికి 80% రాయితీ రూ.2 లక్షల నుంచి రూ.4లక్షల వరకు రుణం తీసుకున్న వారికి 70% రాయితీ లభిస్తుందని ఈ విషయంపై దరఖాస్తుదారులకు మండల స్థాయి అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.



జిల్లాలో ఘనంగా రంజాన్ వేడుకలు

సంగారెడ్డి జోన్/ఝరాసంగం(జహీరాబాద్)/రామచంద్రాపురం(పటాన్‌చెరు): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఘనంగా వేడుకల నిర్వహించుకున్నారు. సోమవారం సంగారెడ్డి పట్టణ శివారులోని హాస్టల్ గడ్డ ఈద్గా మైదానంలో ముస్లింలు అంతా కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ప్రత్యేక సందేశాన్ని వినిపించారు. అనంతరం ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలియ చేసుకున్నారు. ఇక జహీరాబాద్‌లోని ఝరాసంగం మండలంలో ఆయా గ్రామాలలోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పటాన్‌చెరు, రామచంద్రాపురం భారతీనగర్ డివిజన్, తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో సోమవారం రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప, బీఆర్ఎస్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు షేక్ అబ్దుల్ ఘనీలు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

– ఫొటోలు: జహీరాబాద్,
సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి.





ఝరాసంగంలో... రంజాన్ వేడుకల్లో నాయకులు

ఉపాధి కూలీ పెంపు

కనీస వేతనం రూ.7లు పెంపు
- రూ.300 నుంచి రూ.307కు పెరుగుదల
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- నేటి నుంచి అమలు

సంగారెడ్డి జోన్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు కనీస వేతనం పెంచుతూ తీపి కబురు అందించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు సైతం జారీ చేసింది. గతంలో ఉన్న దానికంటే రూ.7లు పెంచుతున్నట్లు ప్రకటించింది. పెంచిన వేతనం ఏప్రిల్ ఒకటి నుంచి అమలు కానుంది. ఉపాధిహామీలో భాగంగా ప్రతీ కుటుంబానికి వంద రోజులు పని కల్పించనున్నారు.

ఉపాధి హామీ పథకంలో భాగంగా పనిచేసే కూలీలకు రూ.300 నుంచి రూ.307లకు పెంచుతూ సవరణలు చేశారు. 2024–2025 ఆర్థిక ఏడాదిలో ఉపాధిహామీ కూలీలకు కనీస వేతనం రూ.300 అందించారు. దీంతో జిల్లాలోని 2.25లక్షల మంది కూలీలకు లబ్ధి చేకూరనుంది. ఉపాధి హామీ పథకం ప్రారంభించిన ప్రారంభంలో కనీస వేతనం రూ.87.50లు చెల్లించేవారు. మారుతున్న కాలానికనుగుణంగా పెరుగుతున్న నిత్యావసరాలను దృష్టిలో ఉంచుకుని కూలీలకు కనీస వేతనాన్ని పెంచారు.

ఉపాధిలో చేపట్టే పనులు

జాబ్ కార్డ్ కలిగి ఉన్న ప్రతీ ఒక్కరికి ఉపాధి హామీ పథకంలో పని కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా జల వనరుల సంరక్షణ పనులు, నర్సరీల నిర్వహణ, మొక్కలు నాటడం, సంరక్షణ, పంట పొలాలకు మట్టి కట్టలు, పొలాలకు వెళ్లేందుకు మట్టిరోడ్లతోపాటు వివిధ అభివృద్ధి పనులు కల్పిస్తున్నారు. చేపట్టిన పనుల కొలతల ఆధారంగా కూలీలకు డబ్బులు చెల్లించనున్నారు.



ఉపాధి హామీలో పని చేస్తున్న కూలీలు

ఏప్రిల్ 1 నుంచి కొత్త ఉపాధి పనులు ప్రారంభం

ఉపాధి హామీ కూలీలకు పెంచిన వేతనం నేటి నుంచి అమలు కానుంది. అదేవిధంగా నేటి నుంచి ఉపాధి హామీలు 2025–2026 ఆర్థిక ఏడాది నూతన పనులు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్, మే నెలలలో పనులు జోరుగా సాగనున్నాయి. దీంతో కూలీలకు లబ్ధి చేకూరనుంది. మండుతున్న ఎండలు దృష్ట్యా ఉదయం సమయంలోనే పనులు పూర్తి చేసుకునేవిధంగా సంబంధిత అధికారులు కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలోని ఉపాధి హామీ వివరాలు	
గ్రామ పంచాయతీలు	619
జాబ్ కార్డులు	2.19లక్షలు
ఉపాధి కూలీలు	4.3లక్షలు
యాక్టివ్ జాబ్ కార్డులు	1.32లక్షలు
35,000	రోజూ హాజరవుతున్న కూలీలు (సుమారుగా)

పెరగనున్న కూలీల సంఖ్య

ఉపాధి హామీలో భాగంగా రోజురోజుకీ కూలీల సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో 35వేలకు పైగా ప్రతిరోజు కూలీలు పనులకు హాజరవుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ పనులు పూర్తి కావస్తున్నాయి. ఇతర ఏ పనులు ఉండకపోవడంతో ఉపాధికి కూలీల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. ప్రతీ కూలీకి 100 రోజులు పని కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఇక సన్న బువ్వ

నేటి నుంచి బియ్యం పంపిణీ
- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- ఉమ్మడి జిల్లాలో 28లక్షల మందికిపైగా లబ్ధి



సిద్దిపేటలో రేషన్ దుకాణానికి చేరిన సన్నబియ్యం

సన్న బియ్యం వచ్చేశాయి. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు చేరుకున్నాయి. మంగళవారం నుంచి పంపిణీ చేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. హుస్నాబాద్‌లో 8వ రేషన్ షాపులో పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, అలాగే పలుచోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించనున్నారు.

సాక్షి, సిద్దిపేట: ఉమ్మడి మెదక్ జిల్లాలో 8,83,883 రేషన్ కార్డులున్నాయి. ఇందుకు నెలకు 18,205.019 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. 28,50,964 మందికి లబ్ధిచేకూరనుంది. ఇందులో 8,25,324 ఆహార భద్రత కార్డులకు 26,93,609 సభ్యులకు ఒక్కరికి 6కిలోలు, 58,311 అంత్యోదయ కార్డులకు గాను ఒక్కో కార్డుకు 35 కిలోలు, 248 అన్నపూర్ణ కార్డులకు ఒక్కొక్కరికి 10కిలోల చొప్పున ఉచితంగా సన్న బియ్యంను పంపిణీ చేస్తారు.

ఇక అక్రమాలకు చెక్

బయటి మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు ఆకాశానంటుతున్నాయి. మధ్య తరగతి, సామాన్యులు కొనలేని పరిస్థితి. ఇది వరకు రేషన్ షాప్‌ల్లో ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని 80శాతం మంది లబ్ధిదారులు అమ్మి సన్న బియ్యం కొనుగోలు చేసేవారు. దీంతో రేషన్ బియ్యం పక్క దారి పట్టేది. తాము అధికారంలోకి వస్తే సన్న బియ్యం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా కొలువుదీరిన ఏడాదిన్నరకు సన్న బియ్యం పథకానికి శ్రీకారం చుట్టింది.

అన్ని ఏర్పాట్లు చేశాం



రేషన్ షాపుల ద్వారా కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే దాదాపు అన్ని రేషన్ షాపులకు బియ్యం చేరుకున్నాయి. ప్రతి నెలా 1 నుంచి 18వ తేదీ వరకు పంపిణీ జరగనుంది. లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– తనూజ, డీఎస్‌ఓ, సిద్దిపేట

జిల్లా	అంత్యోదయ	ఆహార భద్రత	అన్నపూర్ణ	మొత్తం	బియ్యం(టన్నులు)
సిద్దిపేట	18,336	2,72,909	82	2,91,327	5,775.742
మెదక్	13,860	1,99,902	66	2,13,828	4,430.496
సంగారెడ్డి	26,115	3,52,513	100	3,78,728	7,998.781

టోల్ రేట్లు పెంపు

నేటి నుంచి అమలు

సంగారెడ్డి: మరోసారి టోల్‌గేట్ రేట్లు పెరిగాయి. ఈ మేరకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌ఎచ్‌ఏఐ) వర్గాలు వెల్లడించాయి. అకోలా–నాందేడ్ హైవేపై చౌటకూర్ మండలం తడ్డాన్‌పల్లి టోల్ ప్లాజా వద్ద కొత్త రేట్లతో కూడిన బోర్డులను అక్కడి యాజమాన్యం ప్రదర్శించింది. లైట్ వెయిట్ మోటార్ వెహికల్స్ కారు, జీపు, వ్యాన్ తదితర వాహనాలకు రూ.5 చొప్పున పెంచగా... నెలవారీ పాస్ రూ.150కు పెరిగింది. వాణిజ్య వాహనాలకు రూ.5 చొప్పున, నెలవారీ పాస్‌కు రూ.240 పెంచారు. మూడు చక్రాల వాణిజ్య వాహనాలకు రూ.15 చొప్పున వీటికి మంత్లీ పాస్ రూ.550 చొప్పున పెరిగాయి. భారీ వాహనాలైన బస్సు, ట్రక్కులకు రూ.15 చొప్పున, మంత్లీ పాస్ రూ.505 చొప్పున పెరిగాయి. ఇక ఓవర్ సైజ్ వెహికల్‌కు రూ.25, మంత్లీ పాస్ రూ.965కు పెరిగింది. ఈ పెరిగిన రేట్లన్నీ ఈనెల 1 నుంచి అమలులోకి రానున్నాయి.



గుమ్మడిదల టోల్ ప్లాజా

గుమ్మడిదల టోల్‌ప్లాజాలోనూ...

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్ర సమీపంలోని టోల్‌గేట్‌లో ఈనెల 1 నుంచి కొత్త టోల్ చార్జీలు అమల్లోకి రానున్నాయి. కారు జీపు లైట్ వెయిట్ మోటార్ వెహికల్ పై రూ.5 రూపాయలు పెరిగాయని, బస్సులు, భారీ వాహనాలపై రూ.10 రూపాయల చొప్పున చార్జీలు పెంచినట్లు టోల్‌ప్లాజా నిర్వాహకులు రాజేందర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెరిగిన చార్జీలు సోమవారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి వస్తాయని వెల్లడించారు. చార్జీల పెంపుపై వాహనదారులు టోల్ ప్లాజా సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈద్గాలను సందర్శించిన ఎస్పీ

సంగారెడ్డి జోన్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి హాస్టల్ ఈద్గాను సోమవారం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సందర్శించారు. ఈద్గా వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఎస్పీతో పాటు సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, సంగారెడ్డి టౌన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, రూరల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, స్పెషల్ పార్టీ సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని నెల రోజుల పాటు (ఏప్రిల్ 1 నుంచి 30 వరకు) జిల్లావ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్–1861 అమలులో ఉంటుందని ఎస్పీ పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. అనుమతి లేకుండా చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఈద్గా వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్, చిత్రంలో డీఎస్పీ సత్తయ్యగౌడ్, సీఐలు రమేష్

ఫోర్జరీ కల'కలం'

- అదనపు కలెక్టర్, ఇద్దరు ఉన్నతాధికారులపై కేసు ఘటన
- అధికార దుర్వినియోగ ఫలితం
- ధాన్యం ఒకరికి ఇచ్చి... సీఎంఆర్ మరొకరిని అడిగిన వైనం
- దుబాయ్‌కు వెళ్లిపోయిన మాజీ ఎమ్మెల్యే షకీల్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అధికార దుర్వినియోగానికి పాల్పడిన వ్యవహారంలో అధికారులు తగిన ఫలితం చవిచూడాల్సి వస్తోంది. రైస్ మిల్లు యాజమాని సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటనలో సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తోపాటు మరో ఇద్దరు ఉన్నతాధికారులు కేసు నమోదు కావడం నిజామాబాద్, సంగారెడ్డిలో కలకలం రేపింది. గతంలో చంద్రశేఖర్ నిజామాబాద్‌లో అదనపు కలెక్టర్‌గా పనిచేసిన సంగతి తెలిసిందే. తప్పుడు మార్గంలో వెళ్లేందుకు అధికారులను ప్రోత్సహించిన మాజీ ఎమ్మెల్యే షకీల్ మాత్రం దుబాయ్ వెళ్లిపోయి హాయిగా వ్యాపారాలు చేసుకుంటున్నాడు.

ఇదీ జరిగింది....

2022–23 సీజన్‌లో వర్ని మండలంలోని కిశోర్ అనే వ్యక్తికి చెందిన శ్రీనివాస రైస్‌మిల్లుకు కేటాయించిన ధాన్యం పంపించకుండానే పంపించినట్లు ఉన్నతాధికారులు చూపించారు. సదరు రైస్‌మిల్లు యజమాని సంతకాన్ని ఫోర్జరీ చేసి మరీ కథ నడిపించారు. కథ ఇంతటితో ఆగలేదు. ధాన్యం మాజీ ఎమ్మెల్యే షకీల్ మిల్లుకు పంపించి, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను కిశోర్‌కు చెందిన శ్రీనివాస రైస్ మిల్లు నుంచే ఇవ్వాలని ఒత్తిడి తేవడం గమనార్హం. ఈ విషయమై కిశోర్ నెలల తరబడి పోరాటం చేయాల్సి వచ్చింది. చివరకు కోర్టు ఆదేశాలతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులపై కేసు నమోదైంది.

ఒక్క గింజ కుండా మిల్లింగ్ చేయకుండా...

2021–22 యాసంగి, 2022–23 వానాకాలం సీజన్లకుగాను షకీల్‌కు చెందిన రహీల్, రాస్, అమీర్, దాన్విక్ అనే మిల్లుల పేరిట 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం ఇచ్చింది. అయితే ఈ మిల్లుల్లో ఒక్క గింజ ధాన్యం కూడా మిల్లింగ్ చేయలేదు. నేరుగా ధాన్యాన్ని అక్రమ మార్గంలో ముంబై, కాకినాడ పోర్టుల ద్వారా ఎగుమతి చేసి సొమ్ము చేసుకున్నారు. కేవలం 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యానికి ఇచ్చేంత పరిమాణంలో రీసైకిల్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు ఇచ్చారు. ఓ 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రం ఏఆర్ ఇండస్ట్రీస్ (ఎడపల్లి), ఆర్‌కాం ఇండస్ట్రీస్ (వర్ని), అబ్దుల్ ఐ ఇండస్ట్రీస్ (ఎడపల్లి), ఎఫ్‌టీఎఫ్ ఇండస్ట్రీస్ (బోధన్) వాళ్లకు ఇచ్చినట్లు చూపించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఈ నాలుగు మిల్లుల యజమానులతో బలవంతంగా ధాన్యం తీసుకున్నట్లు లేఖలు ఇప్పించాడు. షకీల్ ఒత్తిడితోనే లేఖలు ఇచ్చినట్లు సదరు మిల్లర్లు తెలిపారు. రూ.60 కోట్ల విలువ చేసే ధాన్యానికి బియ్యం ఇవ్వకపోవడంతో ప్రభుత్వం షకీల్‌కు చెందిన మిల్లులకు రూ.10 కోట్ల జరిమానా వేసింది. ఇప్పటివరకు సీఎంఆర్ ఇవ్వకపోవడంతోపాటు, జరిమానా సైతం కట్టలేదు. అధికారులు మాత్రం నోటీసులు ఇచ్చామని చెబుతూ కాలం గడిపారు. మరోవైపు కిశోర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి కథ నడిపిన అధికారులే సీఎంఆర్ కిశోరే ఇవ్వాలంటూ ఒత్తిడి చేస్తూ వచ్చారు. ఈ విషయంలో మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి చొరవ తీసుకుని షకీల్ దండుకున్న ధాన్యం డబ్బులను రికవరీ చేసేందుకు కృషి చేస్తుండటం గమనార్హం. ఈ నేపథ్యంలోనే అదనపు కలెక్టర్, మాజీ డీసీవో, డీటీలపై కేసులు నమోదయ్యాయి.



సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో..

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కోట్లాది రూపాయల విలువజేసే ధాన్యాన్ని ప్రభుత్వం వద్ద తీసుకుని ఒక్క గింజ కూడా మిల్లింగ్ చేయకుండా అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టారీతిన దందా చేశారు. మళ్లీ అధికారంలోకి వస్తామనే నమ్మకంతో ధాన్యం ఇవ్వకుండానే కిశోర్ మిల్లు నుంచి సీఎంఆర్ ఇవ్వాల్సిందేనని ఒత్తిడి చేయించాడు. అయితే బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోవడంతో షకీల్ దుబాయ్ వెళ్లిపోయారు. జిల్లాలో మొత్తం 41 మంది మిల్లర్లను ప్రభుత్వం డిఫాల్టర్లుగా ప్రకటించింది. ఈ మిల్లర్లు రూ.417 కోట్ల విలువ చేసే కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. అయితే ఇందులో ఒక్క షకీల్ నుంచి రావాల్సిన బియ్యం విలువే రూ.60 కోట్ల మేర ఉండటం విశేషం.

క్లుప్తంగా

మహిళపై అడవి పంది దాడి



గాయాలతో లక్ష్మి

చిన్నశంకరంపేట(మెదక్): అడవిలోకి వెళ్లిన మహిళపై అడవి పంది దాడి చేసిన ఘటన చిన్నశంకరం పేట మండలం ఎస్.కొండాపూర్ అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గవ్వలపల్లి తండాకు చెందిన దేవసుత్ లక్ష్మీ సోమవారం మోదుకు ఆకులను తెంపేందుకు అడవిలోకి వెళ్లింది. కొండాపూర్ రాజుల గుట్ట వద్ద ఆకులు తెంపుతున్న క్రమంలో మహిళపై అడవి పంది దాడి చేసి గాయపర్చింది. అప్రమత్తమైన మహిళ తప్పించుకొని రోడ్డుపైకి చేరింది. విషయం గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, మహిళను మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

టైరు పగిలి కారు బోల్తా

ఇద్దరికి స్వల్ప గాయాలు



బోల్తా పడిన కారు

చిన్నకోడూరు(సిద్దిపేట): కారు బోల్తా పడిన ఘటన మండల పరిధిలోని మల్లారం శివారులో రాజీవ్ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలానికి చెందిన ఎడపల్లి సాగర్ రెడ్డి, తన సోదరుడి కుమారుడు కారులో హైదరాబాద్‌లో వెళ్తున్నారు. మల్లారం శివారులో కారు టైర్ పగిలి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. కారులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

ముగురికి తీవ్ర గాయాలు



ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

వట్‌పల్లి(అందోల్): టీవీఎస్ ఎక్సెల్, బైక్ ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామ సమీపంలో నాందేడ్- అకోలా జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. అందోలు మండల పరిధిలోని రాంసాన్‌పల్లి గ్రామానికి చెందిన మన్నె గోపాల్ తన బావ నగేశ్‌తో కలిసి బైక్‌పై ఆయన స్వగ్రామమైన గడిపెద్దాపూర్ గ్రామానికి వెళ్తున్నారు. కన్‌సాన్‌పల్లి గ్రామ సమీపంలో రహదారి విశ్రాంతి భవనం వద్దకు చేరుకోగానే టేక్మాల్ మండలం బర్దీపూర్ గ్రామానికి చెందిన దిగాల అంజయ్య టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై జోగిపేటకు వస్తున్న క్రమంలో రెండు బలంగా ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో నగేశ్ కాలు విరుగగా, గోపాల్, అంజయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాద ఘటన సమాచారం అందుకున్న జోగిపేట పోలీసులు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఇందులో నగేశ్, గోపాల్‌ను హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏడుపాయల్లో నీట మునిగి వ్యక్తి మృతి

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో నీట మునిగి వ్యక్తి మృతి చెందాడు. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం అమీరాబాద్‌కు చెందిన సిరిగోరి రాజు(24) చందానగర్‌లోని పికిల్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. నలుగురు స్నేహితులతో కలిసి సోమవారం ఏడుపాయలకు వచ్చాడు. మధ్యాహ్నం మంజీరా నదిలోని రెండో బ్రిడ్జి సమీపంలో ఇద్దరు వంట చేస్తుండగా, మరో ఇద్దరు స్నానం కోసం మంజీరా పాయల్లోకి దిగారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి రాజు మృతి చెందాడు. వీరు మద్యం మత్తులో ఉన్నట్లు తెలుస్తుంది. తోటి స్నేహితులు స్థానికులకు సమాచారం ఇవ్వగా గజ ఈతగాళ్ల సహాయంతో రాజు మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వరిపై తెగుళ్ల దాడి



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు కొండె ఎల్లారెడ్డి. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ గ్రామం. ఈ యాసంగిలో తన కున్న 10 ఎకరాల్లో వరి పంట వేశాడు. పంట ఈని గొలుసులు బయటకు వచ్చాక గింజ గట్టి పడకుండా తాలుపోయి(పొల్లు) తెల్లగా నిలబడిపోతుంది. ఎంతో ఖర్చు పెట్టి రకరకాల మందులు స్ప్రే చేసినా ఫలితం లేదు. ఇప్పటికే వేల రూపాయల మందులు తెచ్చి కొట్టినా మట్టిలో పోసినట్లే అయ్యింది. అప్పు తెచ్చి రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టిండు. పంటకు వచ్చి తెలుగు చూసి తీవ్ర ఆందోళనకు గురవుతున్నాడు. ఇది ఈ ఒక్క రైతు పరిస్థితే కాదు జిల్లాలోని రైతుల అందరి పంటలు ఇలాగే ఉన్నాయి.

చేతికొచ్చే దశలో దెబ్బతింటున్న చేను

- గింజలు గట్టి పడకుండా తాలుబోతున్న గొలుసులు
- ఎన్ని మందులు కొట్టినా దక్కని ఫలితం
- మెడ విరుపు, మొగి పురుగు, అగ్గితెగులు అంటున్న వ్యవసాయాధికారులు
- ఆందోళనలో జిల్లా రైతాంగం

దుబ్బాక: వరి పంటలకు మాయదారి రోగం ఏదో సోకడంతో రైతులు పరేషాన్‌లో పడ్డారు. ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకొని.. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టినా తీరా పంట చేతికొస్తుందన్న గ్యారంటీ లేని పరిస్థితులు ఏర్పడ్డాయి. అసలే వానాకాలంలో భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. దిగుబడులు రాక రైతులకు పెట్టుబడులు మీదపడ్డాయి. ఈ యాసంగిలోనైనా పంటలు బాగా వస్తుందని గంపెడాశతో పెద్ద ఎత్తున వరి సాగు చేశారు. తీరా చేను పొట్టదశకు వచ్చి ఈనుతున్న తరుణంలో బయటకు వచ్చిన గొలుసులకు గింజలు గట్టిపడకుండా తెల్లగా తాలు పోయి అలాగే నిలబడిపోతుండటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

3.53 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాలో చెరువులు..కుంటల్లో సమృద్ధిగా నీరుండడంతో ఈ యాసంగిలో రికార్డు స్థాయిలో 3.53 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు అయ్యింది. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ముందుగా వేసిన వరి పంటలు ఈని గింజలు ఎర్రబడుతున్నాయి. ఈ క్రమంలోనే చాలా ప్రాంతాల్లో ఈనిన వరి చేలు ఈనినట్లుగానే గొలుసులకు గింజలు పాలుపోసుకోకుండా అలాగే తెల్లబడి నిలబడిపోతున్నాయి. దుబ్బాక మండలంలోనే కాదు జిల్లాలోని చాలా గ్రామాల్లో వరి పంటల పరిస్థితి ఇలాగే తయారైంది. కొద్ది రోజుల్లో పంట చేతికొస్తుందనుకున్న రైతులకు ఈ మాయదారి రోగం ఆందోళన కలిగిస్తుంది.



దుబ్బాకలో గింజగట్టి పడకుండా గొలుసు తాలుపోతున్న వరి

ఇష్ట మొచ్చిన మందులు

వరి చేనుపై రైతులు ఇష్టమొచ్చిన మందులు పిచికారీ చేస్తున్నా ఫలితం లేని పరిస్థితి కనబడుతుంది. నాట్లు వేసినప్పుడు వాతావరణ పరిస్థితులతో ఎదగకుండా ఎర్రగా ఉండటంతో అప్పటి నుంచి ఇప్పుడు ఈని గొలుసు తాలుబోతుండటంతో రకరకాల మందులను వేల రూపాయలు పెట్టి తెచ్చి స్ప్రే చేస్తున్నా ఫలితం లేని పరిస్థితి ఏర్పడింది.

మెడ విరుపు, మొగి పురుగు, అగ్గి తెగుళ్లే..

వరి చేను ఈని గింజలు గట్టి పడకుండా తాలుపోవడం వంటిది మొగి పురుగు, అగ్గి తెగుళ్ల లక్షణాలుగా వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇది వరకు అగ్గి తెగులు సోకిన భూముల్లో ఈ మెడ విరుపు తెగులు లక్షణాలు కనబడుతున్నాయని చెబుతున్నారు. వానాకాలంలో సైతం ఇలాగే వరి పంటలకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

ఏం తోస్తలేదు



నాలుగు ఎకరాల వరి పంట వేసిన.. చేను మొత్తం ఈనుతుంది. ఈనినా గొలుసు పాలు పోసుకోకుండా గింజ గట్టి పడకుండా తెల్లగా నిలబడిపోతుంది. చేను గిట్లయితుందని మందు తెచ్చి కొట్టినా ఏం లాభం లేదు. వ్యవసాయాధికారి వచ్చి చూశారు. చేతికొస్తుందనుకున్న చేను గిట్లకా వట్టి.. ఏం తోస్తలేదు. గత వానాకాలంలో కూడా గిట్లనే అయ్యి చాలా నష్టమైంది.

– పాతూరి లక్ష్మణ్, రైతు దుబ్బాక

పంటలను పరిశీలిస్తాం



జిల్లాలో ఈ యాసంగిలో పెద్ద ఎత్తున వరి పంటల విస్తీర్ణం పెరగడంతో రకరకాల తెగుళ్లు వస్తున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వరి పంటలను వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి వ్యవసాయాధికారులం పరిశీలించి ఎందుకు ఇలా జరుగుతుందో పూర్తిగా అధ్యయనం చేస్తాం. రైతులు తమ పంటలకు సంబంధించి ఏదైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకొస్తే సమస్య మొదట్లోనే పరిష్కరిస్తే ఎక్కువ నష్టం కలుగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవచ్చు.

– రాధిక, జిల్లా వ్యవసాయ అధికారి

ప్రస్తుతం వరి పంటలపై మెడ విరుపు లక్షణాలు కనిపిస్తే ట్రై సైక్లోజిన్ లేదా గెలిలియో సెన్స్ మందులు స్ప్రే చేయాలంటూ వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు.

పట్టుబట్టి.. కొలువులు కొట్టి

పట్టణానికి చెందిన వెంకటేశ్‌కు మూడు ప్రభుత్వ ఉద్యోగాలు



తల్లిదండ్రులతో వెంకటేశ్

దుబ్బాక: కలెక్టర్ అయ్యి పేద ప్రజలకు సేవా చేయాలన్నదే తన లక్ష్యమని దుబ్బాక పట్టణానికి చెందిన గ్రూపు 1 ర్యాంకర్ బైండ్ల వెంకటేష్ సోమవారం తెలిపారు. దుబ్బాకకు చెందిన రిటైర్డ్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి బైండ్ల నారాయణ కుమారుడు వెంకటేశ్ గ్రూప్ 1 జనరల్ కేటగిరీలో 543 ర్యాంక్, ఎస్సీ కేటగిరీలో 31వ ర్యాంక్ సాధించాడు. ఇది వరకే గ్రూప్ 4లో ర్యాంక్ కొట్టి సంగారెడ్డి రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేశాడు. ప్రస్తుతం కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. తాజాగా గ్రూప్ 1 ఫలితాల్లో ర్యాంక్ సాధించడం విశేషం. తనకు ఆర్డీవో లేదా డీఎస్పీ ఉద్యోగం రావొచ్చని వెంకటేశ్ తెలిపారు. తన విజయంలో తల్లిదండ్రుల పాత్రనే కీలకమని, కలెక్టర్ కావడమే లక్ష్యమని చెప్పుకొచ్చాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కోహీర్ ఎస్ఐ సతీశ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎండీ.ఆతీక్ (32) రోడ్డు గుండా కాలినడకన వెళ్తున్నాడు. వెనుకాల నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మరో యువకుడు..

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఎంఆర్ఎఫ్ పరిశ్రమ ఎదుట ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సోమవారం సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. సంగారెడ్డి పట్టణానికి చెందిన మహమ్మద్ ఇబ్రహిముద్దీన్(24) స్కూటీపై సయ్యద్ మన్నాన్‌తో కలిసి జహీరాబాద్ వైపునకు వెళ్తున్నాడు. ఎంఆర్ఎఫ్ పరిశ్రమ ఎదుట వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇబ్రహిముద్దీన్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న సయ్యద్ మన్నాన్ గాయాలతో బయటపడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

సిద్దిపేటఅర్బన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసుల కథనం మేరకు.. తొగుట మండలం వేములఘాట్‌కు చెందిన దమ్మి శ్రీనివాస్ (49) సిద్దిపేట పట్టణంలోని కాళ్లకుంట కాలనీలో నివాసం ఉంటున్నాడు. 29న కూతురు బాలమణిని అత్తగారి ఊరు రాయపోల్ మండలం కొత్తపల్లి వద్ద దింపి బైక్‌పై సిద్దిపేటకు తిరిగొస్తున్నాడు. అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో ఎన్సాన్‌పల్లి శివారులో ప్రభుత్వ మెడికల్ కళాశాల రోడ్డు వద్దకు చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన అతడిని సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బీఆర్ఎస్ గిరిజన నాయకుడి హత్య

- మద్యం తాగిన మైకంలో గొడవ
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
- కల్హేర్ శివారులో ఘటన



హరిసింగ్(ఫైల్)

కల్హేర్(నారాయణఖేడ్): మద్యం తాగిన మత్తులో జరిగిన గొడవలో బీఆర్ఎస్ గిరిజన నాయకుడిని హత్య చేశారు. ఈ ఘటన కల్హేర్ శివారులో నీలం వాగు వంతెన వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కల్హేర్ కొత్తచెరువు తండాకు చెందిన హరిసింగ్(56) స్థానిక మండల పరిషత్‌లో ఉపాధి హామీ పథకం కింద చెట్లకు నీరు పోసే పనులు చేస్తున్నాడు. ఇతడు చాలా రోజులుగా బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్నాడు. అతడి భార్య పిప్లిబాయి ప్రభుత్వ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగం చేస్తుంది. భార్యాభర్తలు ఇద్దరూ కలిసి ఆదివారం ఉదయం 8 గంటలకు తండా నుంచి కల్హేర్ వచ్చారు. రాత్రి హరిసింగ్ ఇంటికి వెళ్తున్న క్రమంలో పోమ్యానాయక్ తండాకు చెందిన గణపతి, సీతారాం అడ్డుకొని తనను చంపుతామని బెదిరిస్తున్నారని భార్య పిప్లిబాయికి ఫోన్ చేసి చెప్పాడు. మార్గమధ్యలో హరిసింగ్, సీతారాం, గణపతి ముగ్గురూ కలిసి మద్యం తాగారు. తాగిన మత్తులో గొడవ జరుగగా ఇద్దరూ కలిసి హరిసింగ్ మెడకు తువ్వాల చుట్టి హత్య చేశారు. మృతదేహం కనిపించకుండా ఉండేందుకు కల్వర్టులో చొరగొట్టే యత్నం చేశారు. రోడ్డుపై నుంచి ఎవరో వస్తున్నారనే భయంతో మృతదేహాన్ని వదిలేసి పారిపోయారు. మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు వెంకటేశం, వెంకట్‌రెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించారు. హత్య చేసిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. తామే హత్య చేసినట్లు నేరం ఒప్పుకున్నట్లు సమాచారం. మృతుడు హరిసింగ్ భార్య పిప్లిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశం తెలిపారు.

మంత్రాల నెపంతో దాడి

9 మంది అరెస్టు

దుబ్బాకటౌన్ : మంత్రాల నెపంతో ఓ వ్యక్తిపై దాడి చేసిన కేసులో 9 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం బేగంపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన తిరుడి ఆంజనేయులు మంత్రాలు చేస్తున్నాడని అదే గ్రామానికి చెందిన దోనపల్లి ప్రవీణ్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. 29న రాత్రి ప్రవీణ్‌తోపాటు పలువురు సమీప బంధువులతో కలిసి ఆంజనేయులుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆంజనేయులు భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు దాడి చేసిన 9 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులైన దోనపల్లి ప్రవీణ్, దోనపల్లి రాజు, దోనపల్లి లక్ష్మీ, కాస భిక్షపతి, కాస యాదగిరి, రాజు, నవీన్, కరుణాకర్, అరికెల జైపాల్‌ను రిమాండ్‌కు తరలించిన్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

కొండపాక(గజ్వేల్): అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుద్దెడ గ్రామంలో చోటు చేసుకుంది. త్రీ టౌన్ పోలీసుల కథనం మేరకు.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుద్దెడకు చెందిన రొడ్డ మల్లేశం (31)టాటా ఏస్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత నెల 30న వాహనం పంక్చరైందని ఇంట్లో చెప్పి వెళ్లి రాత్రి వరకు రాలేదు. ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. కుటుంబీకులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అదే రోజు రాత్రి 11 గంటల ప్రాంతంలో చిన్నాన్న వ్యవసాయ బావి వద్ద మల్లేశం చెట్టుకు ఉరేసుకున్నాడని విషయం తెలుసుకున్న కుటుంబీకులు హుటాహుటినా వెళ్లారు. వాహనం సరిగా నడవక కుటుంబ పోషణ కోసం సుమారు రూ.4 లక్షల వరకు అప్పులు చేశాడని, అవి తీర్చే మార్గంలేక మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నానమ్మ మందలించిందని యువకుడు



కమ్మరి నర్సింలు (ఫైల్)

నిజాంపేట(మెదక్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..మండల కేంద్రానికి చెందిన కమ్మరి కమలమ్మ మనువడు కమ్మరి నర్సింలు(20) తల్లి చిన్నప్పుడే చనిపోవడంతో నానమ్మ వద్దే ఉంటున్నాడు. ఈ మధ్య కాలంలో ఆమెకి వయస్సు మీద పడటంతో తాను పని చేయలేక పోతున్నానని, నిన్ను పెంచడం నాతో కాదని, నీవు ఏదైనా పని చేసుకొని బతకాలని మందలించింది. దీంతో మనస్తాపం చెంది క్షణికావేశంలో ఇంట్లో చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యువకుడు చనిపోయే ముందు ఇన్‌స్టా గ్రామ్‌లో 'నేను చనిపోయాక అయినా నా విలువ తెలుస్తుందో ఏమో' అని రీల్ పెట్టి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి నానమ్మ కమలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అత్యాచార నిందితులు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పరితోష్ పంకజ్, పక్కన డీఎస్పీ సత్తయ్య గౌడ్

- రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి జోన్: మహిళపై అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. 24న ఓ మహిళ భర్తతో కలిసి సంగారెడ్డి పట్టణానికి పనిపై వచ్చారు. అనంతరం అర్ధరాత్రి 1 గంటల సమయంలో ఆటోలో తిరుగు ప్రయాణం అయ్యారు. మామిడిపల్లి చౌరస్తాలో భర్త మూత్ర విసర్జనకు చేసేందుకు ఆటోను నిలిపాడు. ఇంతలో మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు వచ్చి ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా భర్త వచ్చాడు. అతడిపై దాడి చేయడంతో అక్కడే స్పృహ కోల్పోయి పడిపోయాడు. అనంతరం ఆమెను బలవంతంగా స్కూటీపై ఎక్కించుకొని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. భర్త ఫిర్యాదు మేరకు ఇద్దరు నిందితులను సోమవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు నిందితుల నుంచి స్కూటీతోపాటు 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో డీఎస్పీ సత్తయ్య గౌడ్ ఉన్నారు.

మొక్కలపై అవిశ్రాంత ప్రేమ

ప్రకృతిని సృష్టించిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి

- ఉద్యోగ రీత్యా ఊరు విడిచి వెళ్లినా మళ్లీ సొంత గ్రామానికి
- ఎకరంలో 600 మొక్కలు నాటి ఉద్యానవనం
- సేంద్రియ ఎరువులను ద్రవ రూపంలో అందజేత
- విశ్రాంత జీవనంలో మొక్కల సంరక్షణకు సమయం



వాటర్ ఆపిల్ పండ్లను చూపిస్తున్న రైతు రామారావు

హుస్నాబాద్‌రూరల్: నేలల స్వభావంతోనే రైతులు పంటలు సాగు చేస్తారు. తరి నేల వరి సాగుకు యోగ్యమైన భూమి. ఇందులో వరి తప్ప మరో పంట వేయడానికి రైతులు ఆసక్తి చూపరు. అలాంటిది తరి నేలలో ఎకరంలో 600 మొక్కలు నాటి ప్రకృతిని సృష్టించాడు ఆర్‌టీసీ రిటైర్డు ఉద్యోగి బొంపెల్లి రామారావు. వరి పంట వద్దు ప్రకృతి పర్యావరణం ముద్దు అన్నట్లు రకరకాల మొక్కలు సేకరించి నాటి నిత్యం చెట్ల సంరక్షణతోనే రైతు కాలం సాగిపోతుంది. చెట్లు పెంచితే పక్షులు చేరి కిచకిచరాగలు తీస్తే పల్లె ప్రకృతి మురిసి పోవాలని, పర్యావరణంకు హాని కలుగకూడదని రైతు ఆకాంక్షిస్తున్నాడు.

2017లో ఉద్యోగ విరమణ చేశాక..

హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామానికి చెందిన బొంపెల్లి రామారావు 10వ తరగతి పూర్తి చేసి 1980లో ఆర్‌టీసీలో మెకానికల్ ఉద్యోగంలో చేరి 2017లో ఉద్యోగ విరమణ చేశాడు. తల్లిదండ్రులది వ్యవసాయ కుటుంబం కావడంతో పంటలు అంటే ప్రాణం, చిన్నప్పటి వ్యవసాయ బావి పరిసరాలు తాటి వనాలు, ఎల్లమ్మ చెరువు నీటి జలాశయంతో తన పంట చేళ్లకు ప్రకృతికి కొత్త అందాలను తెచ్చేవి. ఉద్యోగ రీత్యా ఊరు విడిచి కరీంనగర్‌లోనే స్థిరపడ్డ రామారావు ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివించాడు. కుమారుడు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంతో స్థిరపడగా కూతురు ఆస్ట్రేలియాలో స్థిరపడ్డారు. అమ్మానాన్నలు పుట్టిన ఊరిలో ఉండగా ఉద్యోగ విరమణ చేసిన రామారావు ఏడాది పాటు కరీంనగర్ నుంచి తోటపల్లికి వచ్చి పోయేవాడు. పండ్ల తోటలతో వ్యాపారం చేయాలనే ఆలోచన రైతుకు లేదు పంటల సాగుకు కొత్త పద్ధతులను గ్రామీణ రైతులకు పరిచయం చేయాలనే తపన రామారావుది.



డ్రిప్ ద్వారా తోటకు నీటి సరఫరా

ఎకరంలో 600 మొక్కలు

2019లోనే ఊరికి వచ్చి తన ఆరు ఎకరాల వ్యవసాయ భూమిలో ఎకరంలో 600 మొక్కలు నాటి ఉద్యానవనం చేశాడు. శ్రీగంధము 300, జామ 200, దానిమ్మ, పనస, మామిడి, వాటర్ ఆపిల్, ఉసిరి, బొప్పాయి 100 రకరకాల చెట్లను నాటించాడు. మరో 3 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ మొక్కలు నాటించి ప్రకృతిని సృష్టించాడు. అమ్మానాన్నలు 60 ఏళ్ల వరి పంట సాగు చేస్తే రామారావు పంటను మార్చి మొక్కలను పెంచుతున్నాడు. మరో రెండు ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో వరి సాగు సన్న రకం సాగు చేస్తున్నాడు. మొక్కలకు డ్రిప్ సిస్టం ఏర్పాటు చేసి నీరు అందించడంతో పాటు సేంద్రియ ఎరువులను ద్రవ రూపంలో అందిస్తూ మొక్కలను ప్రాణం కంటే ఎక్కువ చూసుకుంటాడు.



వాటర్ ఆపిల్

పండ్ల మొక్కల పెంపకం

తన తోటలో వాటర్ ఆఫిల్ , మామిడి, జామ పండ్లు పెద్ద పరిమాణంలో ఉండటంతో మార్కెట్‌లో డిమాండ్ ఉంది. పండ్లు కరీంనగర్ మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తాడు. పంటల పై ఎంత ఆదాయం వచ్చినా వాటిని మొక్కల సంరక్షణకే ఉపయోగిస్తాడు. వాటర్ ఆఫిల్ జామ, మామిడి పండ్లను తోట వద్దకు ఎవరు వచ్చినా లేదనకుండా తెచ్చి ఇస్తాడు. పల్లె రైతులకు నూతన పంటల సాగు పై అవగాహన కల్పిస్తూ వరికి బదులు వాణిజ్య పంటలు సాగు చేయాలని సూచిస్తాడు. వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు అవగాహన కల్పిస్తే కొత్త రకం పంటలను సాగు చేయడానికి రైతులు ముందుకు వస్తారని భావిస్తున్నాడు.